క్లుప్తంగా

పల్లకీలో ఊరేగిన ఏనుగుమల్లమ్మ



పుష్ప పల్లకీలో ఏనుగుమల్లమ్మ

బి.కొత్తకోట : మండలంలోని హార్సిలీహిల్స్‌పై వెలసిన ఏనుగుమల్లమ్మ ఉత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం ఊరేగింపు ఉత్సవం వైభవంగా నిర్వహించారు. పుష్ప పల్లకీలో కొలువుదీర్చిన ఏనుగుమల్లమ్మ ఉత్సవ విగ్రహాన్ని కొండపై ఊరేగించారు. వివిధ ప్రాంతాల నుంచి హాజరైన భక్తులు ఉత్సవ వేడుకలో పాల్గొన్నారు. భక్తులు ఆలయంలో పూజలు నిర్వహించగా నిర్వాహకులు తీర్థప్రసాదాలను అందించారు.

ఈఏపీసెట్ పరీక్షలు ప్రారంభం



మిట్స్ కళాశాలలో ఈఏపీసెట్ పరీక్షలకు హాజరైన విద్యార్థులు

కురబలకోట : ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల ప్రవేశ పరీక్షల ఈఏపీసెట్–25 బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. మండలంలోని అంగళ్లు మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల, విశ్వం ఇంజినీరింగ్ కళాశాలల్లో ఈ పరీక్షలు పటిష్ట చర్యలు మధ్య కొనసాగాయి. ఆన్‌లైన్ ద్వారా జరుగుతున్న ఈ పరీక్షలు ఉదయం, మధ్యాహ్నం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి
– పీడీ వెంకటరత్నం



కూలీలతో మాట్లాడుతున్న పీడీ వెంకటరత్నం

తంబళ్లపల్లె : ఉపాధి హామీ పనులలో కూలీల సంఖ్య పెంచాలని జిల్లా ఉపాధిహామీ పథకం పీడీ వెంకటరత్నం తెలిపారు. బుధవారం ఆయన మండలంలోని కుక్కరాజుపల్లె పంచాయతీలో పర్యటించారు. పలు ఉపాధి హామీ పనులను తనిఖీ చేశారు. కూలీలతో ముఖాముఖి మాట్లాడారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఉపాధి హామీ పనులు త్వరగా చెల్లించాలని కూలీలు కోరగా బిల్లులు చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామనని హామీ ఇచ్చారు. ఆయన వెంట ఏపీఓ అంజనప్ప, జెఈ మహేష్, టెక్నికల్ అసిస్టెంట్ బాలగంగాధర్, ఫీల్డ్ అసిస్టెంట్ చంద్రశేఖరరెడ్డి ఉన్నారు.

ఐటీసీ సీఎస్‌ఆర్ నిధులతో డ్రై వేస్ట్ నిర్వహణ



కంపోస్టుయార్డును పరిశీలిస్తున్న కమిషనర్ ప్రమీల, ఐటీసీ సంస్థ ప్రతినిధులు

మదనపల్లె రూరల్ : మున్సిపాలిటీలో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ నిర్వహణలో భాగంగా డ్రై వేస్ట్‌కు సంబంధించి కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ (సీఎస్‌ఆర్) నిధులతో నిర్వహించేందుకు ఐటీసీ సంస్థ ముందుకు వచ్చిందని మున్సిపల్ కమిషనర్ కే.ప్రమీల తెలిపారు. బుధవారం బైపాస్‌రోడ్డులోని కంపోస్టుయార్డును కమిషనర్ ప్రమీలతో కలిసి ఐటీసీ సంస్థ ప్రతినిధులు శ్రీనివాస్, హేమలు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఐటీసీ సంస్థ తరపున పట్టణంలో ఉత్పత్తి అయ్యే చెత్త నుంచి డ్రై వేస్ట్ తయారీ చేయడంతో పాటుగా డోర్ టు డోర్ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

మరుగుదొడ్లు ఇంత అధ్వానమా..!
– బస్టాండు నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేసిన సబ్ కలెక్టర్

మదనపల్లె రూరల్ : ప్రతిరోజు వందల సంఖ్యలో ప్రయాణికులు రవాణా సౌకర్యాలకు వినియోగించే ఆర్టీసీ బస్టాండులో మరుగుదొడ్లు నిర్వహణ ఇలాగేనా చేసేది..? పారిశుద్య నిర్వహణ ఇంత అధ్వానంగా ఉంటే ఎలా..? అంటూ సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ అసంతృప్తి వ్యక్తం చేశారు. బుధవారం మదనపల్లె ఆర్టీసీ బస్‌స్టేషన్ ప్రాంగణాన్ని పరిశీలించిన ఆయన బస్టాండ్ నిర్వహణపై బహిరంగంగానే అసంతృప్తి వ్యక్తం చేశారు. బస్టాండులో ప్రయాణికులకు బస్సుల సమయవివరాలు తెలిపే సైన్‌బోర్డులు, టైమింగ్ షెడ్యూల్స్ అందరికీ కనిపించేలా పెద్దబోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. తాగునీటికి సంబంధించి ఆర్వో ఫిల్టర్ ప్రతి 15 రోజులకు తప్పనిసరిగా మార్చాలని ఆదేశించారు. ప్రభుత్వ సేవలపై ఐవీఆర్ఎస్ విధానంలో ప్రజాభిప్రాయసేకరణలో భాగంగా ఆర్టీసీకి సంబంధించి ప్రజల సంతృప్త స్థాయిలు తక్కువగా ఉన్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్...ఆర్టీసీ బస్టాండులను పర్యవేక్షించాల్సిందిగా ఆదేశించిన నేపథ్యంలో తనిఖీలకు వచ్చినట్లు చెప్పారు. బస్టాండులో ప్రయాణికులకు అవసరమైన సౌకర్యాల కల్పనలో ఏమాత్రం రాజీపడవద్దని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ ఈఈ అరవిందాదేవి, మున్సిపల్ కమిషనర్ కే.ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యకరమైన జీవనం

సబ్ కలెక్టర్ మేఘస్వరూప్



మదనపల్లె: యోగాసనాలు వేస్తున్న సబ్ కలెక్టర్ మేఘస్వరూప్

మదనపల్లె రూరల్ : యోగాను ప్రతి ఒక్కరూ తమ జీవితంలో భాగం చేసుకోవడం ద్వారా ఆరోగ్యకరమైన, సంతోషకరమైన జీవితాన్ని గడపవచ్చని సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ అన్నారు. బుధవారం పట్టణంలోని ఎస్వీఆర్ కల్యాణమండపంలో మదనపల్లె మున్సిపాలిటీ ఆధ్వర్యంలో...యోగా డే కర్టెన్ రైజర్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమానికి సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ ముఖ్యఅతిథిగా హాజరై యోగాసనాలు వేసి, ప్రయోజనాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....శారీరక, మానసిక, ఆధ్యాత్మిక ఆరోగ్యాన్ని మెరుగుపరిచేందుకు సహాయపడే పురాతన అభ్యాసం యోగ అన్నారు. యోగా సాధన ద్వారా శరీరాన్ని మరింత శక్తివంతం చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రమీల, తహసీల్దార్ ధనంజయులు, బీజేపీ నాయకులు డాక్టర్. అజ్మతుల్లాఖాన్, రామచంద్ర మిషన్ యోగా మాస్టర్ రంగస్వామి పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం

కలకడ : యోగాతో ఆరోగ్యంగా ఉండవచ్చని ఎంపీడీఓ అబ్దుల్‌రహీం అన్నారు. బుధవారం యోగాడే సందర్భంగా మండలంలోని కె.బాటవారిపల్లె ఉన్నత పాఠశాలలో సచివాలయం సిబ్బంది, ఉపాధ్యాయులు, కార్యాలయ సిబ్బందితో యోగా చేయించారు. ముందుగా చిత్తూరు–కర్నూలు జాతీయరహదారిపై కె.బాటవారిపల్లె నుంచి కలకడ వరకూ అవగాహన ర్యాలీ నిర్వహించారు.

సంపూర్ణ ఆరోగ్యం

పీలేరురూరల్ : యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని తహసీల్దార్ భీమేశ్వర్‌రావు అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో యోగాంధ్ర శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగాంధ్ర శిక్షణ కార్యక్రమంలో జూన్ 21వ తేదీ వరకు ఉంటుందని తెలిపారు. అధికారులు యోగ, ధ్యానం క్రమ తప్పకుండా చేయడం ద్వారా ఒత్తిడిని అధిగమించవచ్చునని తెలిపారు. యోగాంధ్ర శిక్షణ కార్యక్రమం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో శివ శంకర్, ఎంఈవోలు లోకేశ్వర్‌రెడ్డి, పద్మావతి, షీ దివ్య యోగ నిర్వాహకురాలు పి.వి.ఎస్. లక్ష్మీ, మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.



పీలేరు: యోగాంధ్ర శిక్షణ కార్యక్రమంలో అధికారులు



కేవీపల్లె:యోగాంధ్ర ప్రారంభోత్సవంలో అధికారులు

ఆరోగ్యమే మహా భాగ్యం

కేవీపల్లె : ఆరోగ్యమే మహా భాగ్యమని తహసీల్దార్ నరేంద్రకుమార్ అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో యోగాంధ్ర ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుధాకర్, ఎంఈవో రెడ్డిబాషా, పలువురు మండల స్థాయి అధికారులు తదదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ శోభాయాత్రను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న విశ్వహిందూపరిషత్ సభ్యులు

మదనపల్లె రూరల్ : హనుమాన్ జయంతి సందర్భంగా గురువారం పట్టణంలో నిర్వహిస్తున్న హనుమాన్ శోభాయాత్ర, బైక్‌ర్యాలీలో పెద్దసంఖ్యలో హిందువులు పాల్గొని విజయవంతం చేయాలని విశ్వహిందూపరిషత్ (వీహెచ్‌పీ) నాయకులు కోరారు. హనుమాన్ శోభాయాత్ర విజయవంతంపై బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 17 వ తారీఖున వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్, ఆర్ఎస్ఎస్ సంయుక్తంగా నిర్వహించిన శోభయాత్ర ర్యాలీ, అనుకోని సంఘటనలతో అర్థాంతరంగా ఆగిపోయిందన్నారు. నూతనంగా తయారుచేసిన హనుమాన్ విగ్రహ ర్యాలీ నిలిచిపోవడం ప్రజలకు మంచిది కాదని ఎమ్మెల్యే షాజహాన్ బాషా... డీఎస్పీ మహేంద్రను కలసి తదుపరి ర్యాలీకి అనుమతిని తీసుకున్నారన్నారు. గురువారం హనుమాన్ జయంతి సందర్భంగా గతంలో నిలిచిపోయిన ర్యాలీని అంతకుమించి వేడుకగా నిర్వహించనున్నామన్నారు. ఈ ర్యాలీ గతంలో నిర్వహించిన మార్గంలోనే జరుగుతుందని, దీనికి అందరు తమ కుటుంబ సభ్యులతో సహా పాల్గొని ర్యాలీ విజయవంతానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో బండి బాలాజి, మినర్వా కాఫీ మధు, రెడ్డి శ్రీనివాసులు, మురళి స్వామి, జర్మన్ రాజు, ఆంబూరు హేమంత్, అమర, గౌని శంకర, ధీరజ్, తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమం మరచిన కూటమి ప్రభుత్వం

పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



కలకడలో విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

కలకడ : సూపర్‌సిక్స్ హామీలు అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం పేదల సంక్షేమం మరచి కక్ష సాధింపు చర్యలకు దిగుతోందని పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల.రామచంద్రారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని కలకడ సర్పంచ్ ఫ్యారీజాన్ కుమారుడు, వైఎస్సార్ సీపీ రాజంపేట పార్లమెంటరీ మైనార్టీ కార్యదర్శి షావత్‌అల్లీ ఖాన్ అనారోగ్యానికి గురై ఆపరేషన్ చేయించుకున్న విషయం తెలుసుకుని వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. అనంతరం పార్టీ కార్యకర్తలతో కలిసి విలేకరులతో మాట్లాడారు. సూపర్‌స్క్స్ పథకాల అమలు కోసం ప్రజలు ఎదరు చూస్తున్నారని గుర్తు చేశారు. ఇంటింటికి బియ్యం పంపిణీ చేసే వాహనాలను నిలిపి వేసి వేల సంఖ్యలో కుటుంబాలను వీధినపడేసినట్లు అయిందన్నారు. కనీసం వారికి కార్పొరేషన్ ద్వారా ఇచ్చిన రుణంపై గడువు వరకూ కూడా కొనసాగించకుండా తొలగించడమం అన్యాయమన్నారు. వైఎస్సార్ సీపీ కార్యాకర్తలపై కక్ష కట్టడం, అక్రమ కేసులు బనాయించడంపై ఉన్న శ్రద్ధ అభివృద్ధిపై చూపాలని హితవు పలికారు. కార్యక్రమంలో కన్వీనర్ కమలాకర్‌రెడ్డి, సర్పంచ్ ఫ్యారీజాన్, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు శ్రీనివాసులరెడ్డి, కెఎస్ మస్తాన్‌అహమ్మద్, కుమార్‌రెడ్డి, జావాద్, ఖరీముల్లా, వెంకట్రమణరెడ్డి, సద్దాం, జాఫర్, రమణ, తదితరులు పాల్గొన్నారు.

నీరుగట్టువారిపల్లెలో స్తంభించిన ట్రాఫిక్

- ఆగిపోయిన వాహనాలు
- ఇబ్బందులు పడిన పాదాచారులు



నీరుగట్టువారిపల్లెలో రోడ్డుపై ఆగిపోయిన టమాటా వాహనాలు, లారీలు

మదనపల్లె సిటీ : మదనపల్లె పట్టణం నీరుగట్టువారిపల్లె టమాటా మార్కెట్‌వద్ద బుధవారం సాయంత్రం ట్రాఫిక్ స్తంభించింది. రోడ్డుపై లారీలు, ట్రాక్టర్లు, బస్సులు, జీపులు నిలిచిపోయాయి.చౌడేశ్వరి కళ్యాణ మండపం నుంచి మార్కెట్ వరకు భారీ వాహనాలు రోడ్డుపైనే ఆగిపోయాయి.వాహనాలు ఆగిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. టమటా మార్కెట్‌కు బుధవారం భారీ ఎత్తున టమాటాలను రైతులు తీసుకువచ్చారు. సుమారు 1130 మెట్రిక్ టన్నుల కాయలు వచ్చాయి. దిగుబడులు పెరగడంతో రైతులు పెద్ద ఎత్తున సరుకు వాహనాల్లో తీసుకువస్తున్నారు. మార్కెట్‌లో కొందరు అడ్డదిడ్డంగా లోడింగ్ చేస్తుండటంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. దీంతో పాటు ట్రాక్టర్లు, ఇతర వాహనాలో తీసుకువచ్చి టమాటా లోడ్‌లను రోడ్డుపై అడ్డంగా నిలిపివేస్తుండంతో వాహనాలు రోడ్డుపై ఆగిపోయాయి. సుమారు వంద లారీలుగాపై మార్కెట్‌కు వస్తున్నాయి. కదిరిరోడ్డువైపు నుంచి వచ్చే వాహనాలు, మదనపల్లె నుంచి అనంతపురం వైపు వెళ్లే వాహనాలు నీరుగట్టువారిపల్లె మార్కెట్ వద్ద నిలిచిపోయాయి. వాహనాలు భారీ సంఖ్యలో నిలిచిపోవడంతో ట్రాఫిక్ పోలీసులు వచ్చి క్రమబద్ధీకరించారు. ఇప్పటికైనా నీరుగట్టువారిపల్లె వద్ద టమటా ట్రాక్టర్లు,వాహనాలను క్రమపద్ధతిలో మార్కెట్‌లో పోయేలా చేస్తే ట్రాఫిక్ సమస్య తీరుతుందని ప్రజలు అంటున్నారు.

క్షయ వ్యాధిపై ఇంటింటా అవగాహన



మాట్లాడుతున్న డాక్టర్ రమేష్ బాబు

నిమ్మనపల్లె : క్షయ వ్యాధిపై వైద్య ఆరోగ్య సిబ్బంది ఇంటింటా అవగాహన కల్పించాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ రమేష్ బాబు అన్నారు. బుధవారం స్థానిక పీహెచ్‌సీలో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలకు వంద రోజుల టీబీ వ్యాధి క్యాంపెయిన్‌పై సెన్సిటైజేషన్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ రమేష్ బాబు మాట్లాడుతూ సమాజంలో టీబీ వ్యాధిని మూడు పద్ధతుల ద్వారా నియంత్రణ చేయాలన్నారు. అనుమానిత టి.బి లక్షణాలు ఉన్నవారిని గుర్తించాలన్నారు. బి.ఎమ్.ఐ 18 కంటే తక్కువ ఉండడం, షుగర్ పేషెంట్స్, మద్యపానం, ధూమపానం అలవాటుగా ఉన్న వ్యక్తులు, గర్భిణులు, గతంలో ఐదు సంవత్సరాల క్రితం టీబీ సోకి కోలుకున్న వ్యక్తులను గుర్తించి, గళ్ల పరీక్షలు నిర్వహించాలన్నారు. పరీక్షలో పాజిటివ్ వచ్చిన వారికి చికిత్స ప్రారంభించాలన్నారు. అనంతరం కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ, పర్యవేక్షకులు నాగిరెడ్డి, సిహెచ్‌ఓ. ఇందిరా దేవి, పర్యవేక్షకులు సరోజ, దేవేంద్ర, దేవకుమారి పాల్గొన్నారు.

తల్లిదండ్రులకు బాలిక అప్పగింత

పెద్దతిప్పసముద్రం : మండలంలోని పులికల్లులో వారం రోజుల క్రితం ఓ బాలిక (16) ఇంటి నుంచి అదృశ్యమైన విషయం పాఠకులకు తెలిసిందే. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అదృశ్యమైన బాలికను బుధవారం కన్నవాళ్ళకు అప్పగించినట్లు ఎస్ఐ హరిహర ప్రసాద్ తెలిపారు.

సీఎస్‌లో డాక్టరేట్



మదనపల్లె సిటీ : స్థానిక చిత్తూరు రోడ్డులోని ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజీ కంప్యూటర్ సైన్స్ అసోసియేటివ్ ప్రొఫెసర్ వీరేష్‌బాబుకు అన్నామలై యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. స్మార్ట్‌హెల్త్‌కేర్ మానిటరింగ్ సిస్టమ్స్‌లో పరిశోధనకు పరిశోధనకు డాక్టరేట్ లభించింది. అన్నామలై విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డాక్టర్ రమ్య గైడ్‌గా ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ పరికరాలను ఉపయోగించి ఒక స్మార్ట్ హెల్త్‌కేర్ మానిటరింగ్ ఫ్రేమ్‌వర్క్‌ను అభివృద్ధి చేశారు. వీరేష్‌బాబును కాలేజీ కరస్పాండెట్ రామమోహన్‌రెడ్డి, డైరెక్టర్ రామమోహన్ రెడ్డి, చైర్మన్ నాగమల్లారెడ్డి, ప్రిన్సిపాల్ సతీష్‌బాబు, అధ్యాపకులు అభినందించారు.

ఈ నెల 26 నుంచి ఏపీఆర్‌జేసీ కౌన్సెలింగ్

కేవీపల్లె : ఏపీ రెసిడెన్షియల జూనియర్ కళాశాలల్లో ప్రవేశాలకు ఈ నెల 26వ తేదీ నుంచి కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు రాయలసీమ రీజియన్ కన్వీనర్, గ్యారంపల్లె ఏపీఆర్‌జేసీ ప్రిన్సిపాల్ డాక్టర్ చెన్నకేశవులు అన్నారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ 26న ఎంపీసీ, 27న బైపీసీ, 28న ఎంఈసీ, సీఈసీ గ్రూపులకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. అర్హత పొందిన విద్యార్థులు సర్టిఫికెట్లతో కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని కోరారు. అలాగే ఈనెల 30 డిగ్రీ కళాశాల ప్రవేశానికి కౌన్సెలింగ్ ఉంటుందని తెలిపారు.

బియ్యం పంపిణీ బాధ్యత డీలర్లదే

కలకడ : మండలంలోని ప్రతి బియ్యం కార్డుదారునికి నిత్యవసర సరుకులు అందించే బాధ్యత చౌకధరల దుకాణం డీలర్‌దేనని తహసీల్దార్ ఫనికుమార్ అన్నారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఎండీయూ ఆపరేటర్లు, ప్రభుత్వ చౌకధరల దుకాణం డీలర్లుతో నెలవారి సమీక్ష సమావేశం ఏర్పాటు చేసి ప్రసంగించారు. ప్రభుత్వ నిర్ణయానికి, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కట్టుబడి డీలర్లు 1వతేదీ నుంచి ప్రభుత్వం కార్డుదారులకు అందించే నిత్యవసర వస్తువులు సకాలంలో అందుబాటులో అందించాలన్నారు. ఎండీయూ వ్యవస్థపై ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నాక సిబ్బంది చేసేది ఏమీ లేదన్నారు. కార్యక్రమంలో డీటీ, వీఆరోలు, డీలర్లు పాల్గొన్నారు.

మార్కెట్‌కు టమాట వరద
– అత్యధికంగా 1,130 టన్నులు

మదనపల్లె : మదనపల్లె వ్యవసాయ మార్కెట్ యార్డుకు బుధవారం టమాట వరదలా వచ్చి పడింది. తంబళ్లపల్లె నియోజకవర్గంలో అత్యధికంగా సాగు ఉండటంతో రైతులు విక్రయానికి ఇక్కడికి తరలించుకుంటున్నారు. మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాల నుంచి ఈ నెలలోనే అత్యధికంగా 1,130 టన్నుల టమాట వచ్చింది. అయితే ధరల విషయంలో పెరుగుదల లేకపోవడంతో రైతులు నిరాశకు గురయ్యారు. ఎగుమతులు ఉన్నప్పటికి ధర పలకడం లేదు. విక్రయానికి వచ్చిన టమాట మార్కెట్‌లో కిలో అత్యధికంగా కిలో రూ.10 పలకగా అత్యల్పంగా రూ.6 పలికింది. వ్యాపారులు టమాటను పలు రాష్ట్రాలకు ఎగుమతులు చేశారు. మార్కెట్‌కు వచ్చిన టమాట మొత్తం ఎగుమతి అయ్యింది. ఇందులో తమిళనాడుకు వంద టన్నులు, ఒడిసాకు 150 టన్నులు, తెలంగాణకు 300 టన్నులు, పశ్చిమ బెంగాల్‌కు 150 టన్నులు, ఛత్తీస్‌ఘడ్‌కు 300 టన్నులు, కోస్తా–ఆంధ్రాకు 100 టన్నుల టమాటలు ఎగుమతి అయ్యాయి.

ఉద్యోగులతో విద్యుత్ అదాలత్



విద్యుత్ అదాలత్‌తో కూర్చున్న డిస్కం ఉద్యోగులు, సిబ్బంది

మదనపల్లె : మదనపల్లె డిస్కం ఈఈ కార్యాలయ ఆవరణలో బుధవారం ప్రత్యేక విద్యుత్ అదాలత్‌ను నిర్వహించారు. విద్యుత్‌శాఖకు సంబంధించి వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలు, అధికారులు పరిష్కరించనివి, ఎన్నో సమస్యలను చైర్మన్ దృష్టికి తెచ్చి పరిష్కరించుకునేందుకు చక్కటి వేదిక. విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక చైర్మన్ శ్రీనివాస ఆంజనేయమూర్తి, ఆర్థిక సభ్యులు కే.రామమోహన్‌రావు, సాంకేతిక సభ్యులు అంజనీకుమార్, స్వతంత్ర్య సభ్యులు విజయలక్ష్మి హాజరైన ఈ అదాలత్‌కు ఫిర్యాదుదారులు రాలేదు. దీనితో ఎదురుగా వేసిన కుర్చీలు ఖాళీగా ఉండటంతో అధికారులు ఈఆర్‌ఓ, ఈఈ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఏఈలు, ఏఏఓలు, డివిజనల్ ఉద్యోగులు, సిబ్బంది, లైన్‌మెన్‌లను ఆదాలత్‌తో కూర్చొబెట్టారు. దీనితో కార్యాలయంలో వీరి కుర్చీలు ఖాళీగా కనిపించాయి. అధికారులు దీనికి సరైన ప్రచారం చేయకపోవడం, గ్రామస్థాయిలో సమాచారం లేకపోవడంతో వచ్చిన ఫిర్యాదుదారులు కేవలం ఎనిమిది మందే. ఉన్నతస్థాయి కమిటి హాజరైన ఈ ఆదాలత్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకునేలా ప్రచారం కల్పించడంతో డిస్కం అధికారులు విఫలమయ్యారు. అయితే ప్రచారం కల్పించామని ఈఈ గంగాధర్ చెప్పారు.

ఆర్టీసీ బస్టాండ్‌ను పరిశీలించిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్..



ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న అధికారులు

పీలేరు : రెండు రోజులుగా కురిసిన వర్షాలతో జలమయంగా మారిన ఆర్టీసీ బస్టాండ్‌ను అధికారులు పరిశీలించారు. 'జలమయమైన ఆర్టీసీ బస్టాండ్' శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి స్పందన లభించింది. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్ భీమేశ్వర్‌రావు, ఆర్టీసీ డీఎం నిర్మల బస్టాండ్ ప్రాంగణాన్ని పరిశీలించారు. మరుగుదొడ్లు, కాలువలు, బస్టాండ్‌లోని సౌకర్యాలు పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ పరిశీలన నివేదిక ఉన్నతాధికారులకు పంపనున్నట్లు తెలిపారు.

దళితులపై దమనకాండ కనిపించలేదా?

కళ్ళకు గంతలతో నిరసన వ్యక్తం చేసిన వీసీకే నేతలు



కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలుపుతున్న వీసీకే నాయకులు

మదనపల్లె రూరల్ : దళితులపై రాష్ట్రంలో యధేచ్ఛగా కొనసాగుతున్న దమనకాండ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు కనిపించడం లేదా? అంటూ విడుదలై చిరుతైగల్ కట్చి (వీసీకే పార్టీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీటీయం శివప్రసాద్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. దళితులపై దాడులను ఖండిస్తూ, బుధవారం బాస్ కార్యాలయంలో కళ్ళకు గంతలు కట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. సాక్షాత్తు డిప్యూటీ సీఎం ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలోని మల్లాంలో నెల రోజులుగా దళితులపై సాంఘిక బహిష్కరణ కొనసాగుతున్నా, దీనిపై ఇప్పటికీ పవన్ కళ్యాణ్ స్పందించక పోవడం కుల వివక్షకు సంకేతం కాదా? అని ప్రశ్నించారు. విశాఖపట్నం సమీపంలోని ఆక్సిజన్ కాలనీలో అంబేద్కర్ విగ్రహాన్ని తొలగించి, ఎత్తుకెళ్లిపోయారని, దీనిపై ఇప్పటికీ రిలే దీక్షలు కొనసాగుతున్నాయన్నారు. ప్రకాశం జిల్లా కొండేపి నియోజకవర్గంలోని కే. బిట్రగుంటలో అంబేద్కర్ జయంతి ఊరేగింపును ఆధిపత్య కులాల వాళ్లు అడ్డుకున్నారన్నారు. తిరుపతిలో బీటెక్ చదువుతున్న విద్యార్థి జేమ్స్‌ను కిడ్నాప్ చేసి తీసుకెళ్లి ఓ లాడ్జిలో ఒకటిన్నర రోజు చిత్రహింసలు పెట్టి ముఖంపై మూత్రం పోశారన్నారు. ఇలాంటివి అనేకం జరుగుతున్నా, కూటమి ప్రభుత్వం ఒక సంఘటన మీద కూడా స్పందించక పోవడం దారుణమన్నారు. గరగపర్రు దళితుల వెలివేతను ప్రపంచానికి తెలియజేసిన యాకోబు, అనుమానాస్పదంగా మరణించారని, అదే తరహాలో పిఠాపురం నియోజకవర్గంలోని మల్లాం దళితుల సాంఘిక బహిష్కరణను వెలుగులోకి తెచ్చిన సుబ్రహ్మణ్యం అనుమానాస్పదంగా మృతి చెందారన్నారు. వీటిపై సమగ్ర విచారణ జరిపి, వాస్తవాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో భారతీయ అంబేద్కర్ సేన (బాస్) జిల్లా ప్రధాన కార్యదర్శి చాట్ల బయన్న, వీసీకే పార్టీ నాయకులు పెద్దపాలెం రవిశంకర్, బురుజు రెడ్డిప్రసాద్, గంపల రమణ, వై. గంగాధర్, జి. బాబు, జి. గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.


వైభవంగా గంగమ్మ జాతర



ఊరేగింపుగా దీలు, బోనాలు తీసుకెళ్తుతున్న ఎమ్మెల్యే సతీమణి కవితమ్మ

తంబళ్లపల్లె : నియోజకవర్గ కేంద్రం తంబళ్లపల్లె వారపుసంత తోపులో వెలసిన శ్రీ కోటకొండ గంగమ్మ ఆలయంలో బుధవారం గంగజాతరను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి సతీమణి కవితమ్మ స్వగృహం నుంచి దీలు, బోనాలతో మేళాతాళాలు, మంగళవాయిద్యాలు, సాంస్కతిక కార్యక్రమాలతో ఆలయం వద్దకు వచ్చారు. అమ్మవారికి సమర్పించి ప్రత్యేక పూజలతో మొక్కులు తీర్చుకున్నారు. నియోజవర్గంలో వర్షాలు సకాలంలో కురిసి ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని కాపాడమ్మ గంగమ్మ తల్లి అంటూ మొక్కున్నారు. రాత్రికి చుట్టు పక్కల గ్రామాల నుంచి విద్యుత్‌దీపాలతో అలంకరిచిన చాందీనీబండ్లు, పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలతో మొరవణి సాగింది. కార్యక్రమాలు భక్తులను అలరింపజేశాయి. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చౌడేశ్వర్, జిల్లా అధికార ప్రతినిధి జయసింహారెడ్డి, సర్పంచులు జ్యోతి, నీలూఫర్, ఎంపిటీసీ మహేష్, వైఎస్ ఎంపిపి కరీమ్, సర్పంచుల సంఘం అధ్యక్షులు సుధాకర్ రెడ్డి నాయకులు కిషోర్‌రెడ్డి, రాజశేఖరరెడ్డి, కె.ఆర్ మల్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి,మైనుద్దీన్, రామమూర్తి, శ్రీనివాసులు, రాజారెడ్డి, రామశంకరరెడ్డి,చలపతి, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

నూతన వధూవరులకు ఆశీర్వాదం



నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎంపీ మిథున్‌రెడ్డి

పీలేరు రూరల్ : కలికిరి మండలం గుట్టపాళెంకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు జి. సురేంద్రరెడ్డి కుమార్తె యశస్వినికి తమిళనాడుకు చెందిన శక్తివేల్ కుమారుడు రాఘవేంద్రతో స్థానిక ఎంఎస్‌ఆర్ గార్డెన్స్‌లో బుధవారం రాత్రి వివాహం జరిగింది. ఈ వివాహానికి రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి, పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, మదనపల్లె మాజీ ఎంఎల్‌సీ నరేష్‌కుమార్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎ.టి. రత్నశేఖర్ రెడ్డి, నాయకులు భానుప్రకాష్‌రెడ్డి, లాయర్ చంద్రకుమార్‌రెడ్డి, మహితా ఆనంద్, ఉదయ్, చక్రధర్, కాలనీ చిన్న, సురేంద్రనాథరెడ్డి, షాకీర్, మునీర్, అబీద్, దావూద్, పెద్దోడు, జయరామచంద్రయ్య, లక్ష్మీ, అరుణ, లోకనాథరెడ్డి, భువనేశ్వర్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నారమాకుల తండాలో మారెమ్మ జాతర



మారెమ్మ ఆలయంలో గ్రామస్తులతో నిసార్‌అహ్మద్

మదనపల్లె రూరల్ : మండలంలోని నారమాకుల తండాలో మారెమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. గ్రామీణుల ఆరాధ్యదైవం, తండా ప్రజల దేవత మారెమ్మను వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్ అహ్మద్ దర్శించుకున్నారు. బుధవారం నారమాకుల తండాలో స్థానికుల నుంచి నిసార్‌అహ్మద్‌కు ఘనస్వాగతం లభించింది. భక్తిశ్రద్ధలతో మారెమ్మను దర్శించుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా నిసార్‌అహ్మద్ మాట్లాడుతూ జాతరలు గ్రామీణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలన్నారు. నియోజకవర్గంలో వర్షాలు సకాలంలో కురిసి పంటలు సమృద్ధిగా పండాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ మంగునాయక్, ఆనంద్‌రెడ్డి, అమరనాథ్ రెడ్డి, హరినాయక్, ఎస్.రెడ్డెప్పనాయక్, మునిస్వామినాయక్, నర్సింహాలునాయక్, నాగునాయక్, ఈశ్వర్ నాయక్, మహేష్, నర్సింహులు, మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.